


'ప్రేమేంద్ర'

# బ్రతుకు తెరువు

ఎండ తీవ్రత పెరుగుతోంది.

వడగాడ్పులు వీచడం ప్రారంభ మయ్యింది.

ఉద్యోగాన్వేషణలో, ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేసుకుని, నిరాశతో తిరిగి వచ్చిన నారాయణరావు, వుస్సూరను కుంటూ, టీ దుకాణంలో బెంచీపై కూల బడ్డాడు.

పేంటు జేబులోంచి మాసిన రుమాలు తీసి, మొహం వత్తుకున్నాడు.

“ఏం కావాలండీ,” సర్వరు వచ్చి తన డ్యూటీని నిర్వర్తించాడు.

“ఓ టీ యివ్వు-” మెల్లగా అన్నాడు నారాయణరావు.

క్షణంలో టీతెచ్చి అందించాడు. టీని సిప్ చేస్తుంటే, పరదపీళ్ళ గుర్తు కొచ్చాయి నారాయణరావుకి. నవ్వు కుంటూ, టీ తీసుకుంటున్నాడు.

అతని మెదడు ఆలోచనల్లో మునక లేస్తోంది. కామర్స్ గ్రాడ్యుయేట్



అయ్యింది కూడా, తన కాళ్ళమీద తాను నిలబడ్డానికి, ఓ చిన్నపాటి వుద్యోగమైనా సంపాదించుకోలేక పోతున్నానేమిటి. ఎన్నిసార్లు సర్వీసు కమీషన్‌కి అప్లికేషన్లు పంపించాడు! కాని, యే ఒక్కటీ అక్కడను రాలేదు. ఎన్నో ఆఫీసుల్ని సర్వే చేశాడు. అక్కడా, నిరాశే ఎదురయ్యింది. మరి. వుద్యోగాలు సంపాదిస్తున్నవాళ్ళు, యెలా సంపాదిస్తున్నారో, అతని వూహ కందడంలేదు. ఆలోచిస్తూ వుంటే, యీ వ్యవస్థలోనే ఏదో లోపం వుందేమో ననిపిస్తోందతనికి.

నిరాశతో పాటు, జీవితమ్మీద విరక్తి.

కప్పు ఖాళీచేసి, బల్లమీద పెడుతూ, కౌంటరు దగ్గరికి వెళ్ళి డబ్బులిస్తుంటే, లోపల ఓ బల్లదగ్గర కూచున్న సారథి కేకవేశాడు.

"ఒరేయ్ నారాయణా! నేను వచ్చేస్తా నుండు" అంటూ గబగబా వచ్చేసి, కౌంటరులో డబ్బులు చెల్లించాడు సారథి.

ఇద్దరూ అక్కణ్ణించి బైలుదేరారు. "ఎక్కణ్ణించి వస్తున్నావురా?" ప్రశ్నించాడు, సారథి

ఒక నిట్టూర్పు వదిలాడు, నారాయణ రావు "నా నిత్యకృత్యం వున్నదేగా! ఆదే నా-వుద్యోగాన్వేషణ; ఎన్ని ఆఫీసులకు తిరిగినా, యెన్ని కంపెనీల గుమ్మాలు ఎక్కి దిగినా, నిరాశే స్వాగతం చెబుతోంది. నిజం చెప్పాలంటే, జీవితమంటేనే విరక్తి భావం కలుగుతోందిరా సారథీ!" నారాయణ రావు మాటల్లో నిస్పృహ.

మిత్రుడి మాటలు సారథిని కదిలించేశాయి. అతడి సెంటిమెంటుని అర్థం

చేసుకున్నాడు. ఆ పరిస్థితిలో నారాయణరావు ఒక్కడేకాదు. ఎవరైనా అంత నిస్పృహనే నింపుకుంటారు. కాని, అటువంటి పరిస్థితిలోనే ధైర్యం చెప్పాలి... అనుకున్నాడు

"చదువుకున్నవాడివి. ప్రస్తుత పరిస్థితుల్ని ఆకళింపు చేసుకున్నవాడివి. నువ్విలా నిస్పృహ చెందటం బాగు లేదురా నారాయణా! దేశంలో నీలాంటి, నాలాంటి నిరుద్యోగులు లక్షలమందున్నారు. అందరూ నీలా నీళ్ళుగారి పోతున్నారా? నో... నో... ధైర్యాన్ని పెంపొందించుకోవాలి గుండెని రాయిగా మార్చుకోవాలి. మనకి తెలుసు- యీ రోజుల్లో మనలాంటి వాళ్ళకి వుద్యోగం లభించడం యెంత దుర్లభమో! మన కంటె విద్యాధికులు కూడా ఎందరో పట్టాల్ని చేతబట్టుకుని, ఆఫీసుల వెంట, ఫర్మ్లవెంట వుద్యోగాలకోసం తిరుగుతున్నారు. వాళ్ళకి మాత్రం దొరుకుతున్నాయా? లేదు...ఏ కొద్దిపాటి అదృష్టవంతులకో వుద్యోగాలు వస్తున్నాయి. అందులో కేవలం 'ప్రతిభ' ప్రాతిపదికగా వుద్యోగాలు సంపాదించేవాళ్ళు కొందరైతే, యితరత్రా యెన్నో మార్గాల్లో కొందరు సంపాదిస్తున్నారు. ఇక, మనలాంటి వారి సంగతి యెవరికి కావాలి? అందుకే నేను విసిగిపోయి, టైపు యిన్స్టిట్యూట్ పెట్టుకున్నాను" చెప్పుకుపోయాడు సారథి

నారాయణరావు నీరసంగా నిట్టూర్చాడు. "నీలా, ఆర్థికస్తోమత నాకు లేదు కదరా?"

"ఆర్థికస్తోమత కాదు యిక్కడి ప్రశ్న! నిరుద్యోగులకు సెల్ఫ్ ఎంప్లాయ్మెంటు స్కీము క్రింద, బ్యాంకువాళ్ళు అప్పు యిస్తారు అది సమస్యే కాదు. కాని, వ్యాపారాల్లోనూ ఎన్నో యిబ్బందులున్నాయి. స్వానుభవంతో నేను తెల్సుకున్న నిజంరా యిది."

'ఇబ్బందులన్నవి, వుద్యోగాల్లో మాత్రం లేవంటావా? ఏమైతేనేం-లైఫ్ సెటిలవుతుంది కదా! అప్పుడు, నాకేం అనిపిస్తుందో తెలుసా? అనవసరంగా వుద్యోగాన్వేషణలో చెప్పులరగదీసుకున్నానేమోనని; దాంతో, నా ఎనర్జీ, విలువైన సమయం అన్నీ వృధా అయ్యాయనిపిస్తుంది అందుకే, నువ్వన్నట్టు స్వయం ఉపాధిపథకంలో, బ్యాంకునుంచి అప్పు తీసుకుని యే ఫ్యాన్సీ స్టోరో, యింకేదైనా పెట్టుకోవడం మేలనిపిస్తుంది" నిబ్బరంగా చెప్పాడు, నారాయణరావు

సారథి, మెల్లగా నవ్వేడు. తన ప్రయత్నం కొంతయినా ఫలించినందుకు లోలోన ఆనందించాడు. "నీలో నిరాశ తొలగినందుకు నాకు ఆనందంగానే వుందిగాని, వ్యాపారమంటే, అంత సుళువనుకుంటున్నావా యేమిట్రా? అందులోవున్న యిబ్బందులు యిన్ని

అన్నీ కావు. ఇన్‌కంటాక్సు, సేల్సు టాక్సు, తూనికలు కొలతలు- మొదలైన డిపార్టుమెంటుల వత్తిడి యింతా అంతా కాదు. ఇవిగాక, సంబంధితాధికారులు యింతెంతోమంది. వీళ్ళందరి అభిమానాన్ని సంపాదించేసరికి తలప్రాణం తోక్కి వస్తుంది. ఒక్కొక్కప్పుడు, విసుగుపుడుతుంది కూడాను." సారథి చెప్పుకుపోయాడు.

నారాయణరావు తెల్లబోయిన మొహంతో, కనురెప్పలు వెయ్యకుండా, సారథికేసే చూస్తున్నాడు.

"అలా చూస్తావేంరా? నేను చెబుతున్నది అక్షరాలా నిజం. నేను, టైపు యిన్‌స్టిట్యూట్ పెట్టానా? ఎన్ని గొడవలవి? టైపు నేర్చుకునే విద్యార్థులు యెంత మంది వున్నారు? ఒక్కొక్కరికి ఫీజు యెంత? సంవత్సరపు ఆదాయమెంత?- యివన్నీ ప్రశ్నలే! అన్నీ తప్పుడు లెక్కలే వెయ్యాలి. లేకపోతే, యిబ్బందిలో పడతాం. సేల్సుటాక్సు వాళ్ళతో నాకు సంబంధం లేదనుకో; కాని యితర వ్యాపారం యేది ప్రారంభించినా, వారి యిబ్బంది తప్పదు."

"అయితే, చిన్న కాఫీ హోటలు పెట్టుకుంటే మంచిదేమో?" సాలోచనగా అన్నాడు, నారాయణరావు

"అది మాత్రం వీటన్నింటికీ అతీతమనుకుంటున్నావా? కాదు. పైన చెప్పినవాళ్ళ వత్తిడులు తప్పవు. అంతేనా? కొందరైతే కడుపునిండా మెక్కేసి, స్ప్రింగ్ కాఫీ సేవించి, బిల్లు 'పే' చెయ్యకుండా, చక్కాపోతారు. అగడలేని బలహీనతలు యెన్నో వుంటాయి అందుచేత, కాఫీ హోటలు ప్రయోజనకారి కాదు."

నారాయణరావు ఢీలా పడిపోయాడు. "అయితే, మరేంచెయ్యను? జీవితాంతం, వుద్యోగాన్వేషణ చేస్తూ వుండమంటావా?" నీరసంగా అన్నాడు.

"ఛ ఛా! అలా యెందుకు చెబుతాన్రా? మనకి లాభసాటిగా వున్నది, యే డిపార్టుమెంటు వత్తిడీ, యితర్రా యిబ్బందీ లేనివి, నా దృష్టిలో రెండు వ్యాపారాలున్నాయి. ఒకటి ట్యూషన్లు చెప్పుకోడం- నువ్వు యెంతమందికి చెప్పుకున్నా, యెంత డబ్బు ఆర్జించినా, అడిగేవాడుండడు. ఇన్‌కంటాక్సు వాళ్ళు, సేల్సుటాక్సు వాళ్ళు, యితర డిపార్టుమెంటు వాళ్ళు- వీళ్ళెవరిదృష్టీ నీ మీద పడదు. నిశ్చింతగా నీ వ్యాపారాన్ని కొనసాగించవచ్చు..." అని, సారథి యింకేదో చెప్పబోతూ వుంటే నారాయణరావు అందుకున్నాడు.

"అబ్బే! అది లాభంలేదురా సారథీ! మనకంటె విద్యాధికులు, బోధనావృత్తిలో వున్నవారే ఆ రంగంలో వుంటే, మన దగ్గర చదవడానికి ఎవరొస్తారు?" నిరుత్సాహంగా అన్నాడు నారాయణరావు.

"నువ్వన్నదాంట్లో అసత్యమేమీ లేదనుకో; సరే- అది వదిలేద్దాం. రెండోది

"ఏమిటంటే...!" నీళ్లు నమిలాడు సారథి.

"సందేహిస్తున్నావెందుకురా?"

"తెలిశే నువ్వేమీ అనుకోవుకదా?"

"అనుకోడానికేముంది, అసత్యం కాకపోతే?"

క్షణం ఆలోచించాడు సారథి

"అసత్యమేం కాదనుకో! కానీ, నువ్వు న్యూనతగా భావించడానికి అవకాశముంది. అందుకే సందేహిస్తున్నాను."

"చెప్పరా! సందేహమెందుకు?"

"ఓ కిళ్ళీకొట్టు పెట్టుకోరా" చప్పున చెప్పేశాడు సారథి.

తన పక్కనే బాంబు పడినట్టు అదిరిపోయాడు నారాయణరావు. ఇంత చదువూ చదివి, జీవితంలో ఏవో సాధించాలని ఎన్నో ఆశలు పెంచుకుని, చివరికి ఎందుకూ కొరగానివాడిలా కిళ్ళీకొట్టు పెట్టుకోవడమా? సారథి ఆలోచించే చెప్పాడా? లేకపోతే, పరిహాసానికి అలా అన్నాడా... మనసులోనే అనుకున్నాడు నారాయణరావు. అతని అభిమానం కొస్తంత దెబ్బతింది.

"ఏమిట్రా సారథీ నువ్వంటున్నది? ఆలోచించే చెబుతున్నావా! మరి అంత నిరక్షరాస్యుడిలా, కిళ్ళీకొట్టు పెట్టుకోమంటున్నావా? పరిహాసం అడ్డంలేదు కదా?" తెల్లబోతూ అన్నాడు నారాయణరావు

నారాయణరావు మొహంలోకి చూశాడు సారథి. అతనికి తెలుసు, వాడలా బాధపడతాడని! నవ్వని చిరునవ్వు నవ్వేడు.

"పరిహాసం కాదురా నారాయణా! మనస్ఫూర్తిగా నేను చెబుతున్న సలహా ఇది. నువ్వనుకున్నట్టు, నిరక్షరాస్యులే కిళ్ళీకొట్టు పెట్టుకోవాలన్న రూలెక్కడా లేదు. నీకు తెలీదేమో, ఎంతోమంది చదువుకున్నవాళ్ళు ఈ కిళ్ళీకొట్లు పెట్టుకుని జీవితాలు సాగిస్తున్నారు. కిళ్ళీకొట్టు తాలూకు రాబడి గురించి బహుశా నీకు అంచనాలేదు. అందుకే నువ్వు దాన్ని నీరసంగా చూస్తున్నావు. బ్రతుకుతెరువు కోసం ఏదో ఒకటి చెయ్యాలికదా? మన కనుకూలంగా వున్నదే చేస్తాం. అందుకే నీకు మొదటే చెప్పాను, నా సలహాకి నువ్వేం బాధపడకూడదని! నీకసలు ఈ సలహా ఎందుకిచ్చానో తెలుసా?"

"ఎందుకని?"

"దానికి ప్రత్యేకమైన కారణం వుంది. కిళ్ళీకొట్టు పెట్టుకున్నావనుకో! ఆ కొట్టులోనే నువ్వు న్యూస్‌పేపర్లు, వారపత్రికలు, మాసపత్రికలు, నవలలు యిత్యాది పుస్తకాల్ని అమ్మొచ్చు. అంతేనా?... సబ్బులు, ఫేస్‌పౌడర్లు, దోన్నెలు... ఒకటేమిటి? నీ కొట్టుని మినీ ఫ్యాన్సీ స్టోర్సుగా మార్చుకోవచ్చు. ఇన్ని రకాల వస్తువులమ్మినా, అటు ఇన్‌కంటాక్సు, సేల్సుటాక్సువాళ్ళుగాని, ఇటు, తూనికలు-కొలతలు డిపార్టుమెంటువాళ్ళుగాని ఇంకే యితర అధికార్లుగాని, నీ కొట్టు వేపు కన్నెత్తి చూడరు ఎందుకో




తెలుసా? ఏ కొట్టు కిళ్ళీకొట్టు గనక! నీకు తెలీదేమో, కొన్ని కిళ్ళీకొట్లలో రోజుకి వేలమీద అమ్మకం వుంటుంది. అయినాసరే ప్రభుత్వం పట్టించుకోదు. నిజంగా ప్రభుత్వం కిళ్ళీకొట్లకు ఎంత వుపకారం చేస్తోందని? ఇది తప్పించి, నువ్వింక ఏ షాపు పెట్టినా, ఎవరో ఒకరి యిబ్బంది, ఒత్తిడి వెంటాడుతూనే వుంటాయి. నువ్వు విసిగిపోతావు. ఇప్పుడు అర్థమయిందా, నే నెందుకీ సలహా ఇచ్చానో?" అంటూ ముగించాడు సారథి.

సారథి చెప్పిందంతా విన్నాక, అతని సలహా బావున్నట్టే తోచింది నారాయణ రావుకి. బతుకుతెరువుకి ఏదో ఒక మార్గం. న్యూనత పొందాల్సిన అవసరమేముందని? దొంగతనం కాదు... అసభ్యవృత్తి అంతకన్నా కాదు... అనుకున్నాడు.

"నువ్వు చెప్పింది బాగానే వున్నట్టుందిరా సారథీ" అన్నాడు ప్రసన్న వదనంతో.

"వున్నట్టుండటమేమిటి? బాగానే వుంటుందిరా! నిజం చెప్పాలంటే నేనూ యిదే విషయాన్ని తీవ్రంగా యోచిస్తున్నాను...మంచి సెంటరు దొరికితే ఓ కిళ్ళీకొట్టు పెట్టేద్దామని..."

నారాయణరావు విస్తుపోతూ సారథి కేసి చూశాడు.

"అయితే మరి నీ టైపు ఇనిస్టిట్యూట్ ఏంచేస్తావు?" అడిగాడు.

"మా నాన్నగారు చూసుకుంటారులే! ఆయనకీ వుబుసుపోవడం లేదట."

"కిళ్ళీకొట్టులో నువ్వే కూచుంటావా" అనుమానాస్పదంగా అడిగాడు నారాయణ రావు.

"కూడుంటే తప్పేముందిరా! కూడా వచ్చు. కాని, నా ఐడియా వేరేగా ఉంది. కిళ్ళీలు కట్టేందుకు ఓ బాకులాంటి ఓ కుర్రాణ్ణి పెట్టుకుంటాను. మిగతా వస్తువుల అమ్మకం స్వంతంగా చూసుకో వచ్చు."

నారాయణరావు అనుమానం నివృత్తి అయింది. సారథి ఆలోచన బాగానే వుందనిపించింది. మరింకేమీ ఆలోచించ లేదు. అతని మస్తిష్కంలో అప్పుడే ఓ నిశ్చయం జరిగిపోయింది. దొరకని ఉద్యోగాలకోసం, చెప్పులరిగేలా ఎందుకు తిరగడం! దానికంటె, సారథి చెప్పిన సలహా ఆచరణలో పెట్టడం, శ్రేయస్కర మనిపించింది, ఇందులో నామోషి, న్యూనత ఏముంది! బ్రతుకుతెరువుకి ఇదీ ఒక మార్గమే.... అనుకున్నాడు తృప్తిగ.

"థాంక్సురా సారథీ! విలువైన సలహా చెప్పావు. నీ సలహామేరకు ఓ నిర్ణయానికొచ్చేశాను. నువ్వు చెప్పినట్టే ఓ కిళ్ళీకొట్టు పెట్టేస్తాను. బ్రతుకుతెరువు కోసం ఏదో ఒక మార్గాన్ని ఎంచుకో వాలి కదా! నా షాపు ప్రారంభించినరోజు నువ్వు తప్పకుండా రావాలిరా. ముందుగా తెలియజేస్తాలే!" తృప్తిగా అన్నాడు నారాయణరావు.

సారథి ఆనందానికి అవధుల్లేక పోయాయి.

"చాలా సంతోషంరా నారాయణా! నా సలహా పాటించావని కాదు, నీలోని నిరాశానిస్పృహలను పోగొట్టినందుకు, నాకెంతో ఆనందంగా వుంది. తగిన ప్రయత్నం వుండాలేగాని, మనిషికి ఏదీ అసాధ్యం కాదు. నువ్వు షాపు తెరిచిన రోజు తప్పకుండా వస్తాలే..."

"ఆరోజు ఎలాగూ వస్తావు కాని, ముందుగా వచ్చి నాకు సహాయం చెయ్యాలి."

"ఓ.కే" నవ్వుతూ అనేసి, తమఇంటి కేసి తిరిగిపోయాడు సారథి.

నారాయణరావు, హుషారుగా ముందుకి సాగిపోయాడు, ప్రగతిపథంకేసి పయని స్తున్నట్టుగ.

• • •

వారంరోజుల తర్వాత ఒక మంచి సెంటరులో వెలిసింది 'నారాయణ పాన్ షాపు'. అదో మినీ ఫాన్సీ స్టోర్సులా రూపొందింది.

ఆరోజు సారథితోపాటు నారాయణ రావు స్నేహితులు చాలామంది వచ్చి నారాయణరావుని అభినందించారు.

"ఒరేయ్! ఈ అభినందన నాకు కాదురా! సలహాయిచ్చిన మన సారథికే దక్కుతుంది" నవ్వుతూ అన్నాడు నారాయణరావు.

• • •